చిన్నకథ

# ఆలోచించరేం?

పి.వి.బి. శ్రీరామ మూర్తి



నిన్నటి వరకూ మబ్బులు, చిన్న చిన్న చినుకులు, ఉక్కపోత, కరెంటుకోత. ఇవాళ కూడా గొప్ప చిరాగ్గా వుంది. టివీ ముందు కూర్చున్నా. ఇంట్లో కరెంటుంది. కేబుల్ సెంటర్లో కరెంట్ లేనట్లుంది. ఈ మధ్యనే రిటైరయ్యాను. మిత్రుడిచ్చిన భగవద్గీత తెరవగానే! అనన్యాశ్చింతయంతోమా...! శ్లోకం కనిపించింది. నవ్వొచ్చింది. నవ్వక్కర్లేదు. భ్రష్టుపట్టిన ఈ వ్యవస్థను ఆ దేవుడు రక్షిస్తే చాలు. పాపం అంటని ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైరవడం వల్లనో- లోపభూయిష్టమైన ఈ వ్యవస్థనైనా, సమాజం నైనా- కోపాన్ని దిగమింగుకోలేక పోతున్నాను.

పార్లమెంటులో డబ్బుల కట్టలు.

స్వంత తల్లినే తల్లి కాదన్న కొడుకు ప్రవర్తిస్తోన్న సభాధ్యక్షులు. నీతి తప్పిన వారు స్వంత గూటిలో ఇమడలేకపోయామన్న బూకరింపు. 'ఛీ...ఛీ!' ఇంతకంటే ఆత్మహత్య చేసుకుంటే ఉత్తమమేమో? బుర్ర పాడయింది. ఆలోచనలు కందిరీగలై పొడుస్తుంటే స్థిమితం ఎలా కుదురుతుంది?

శ్రీమతి ఉద్యోగానికి పిల్లలు వాళ్ల వాళ్ల పనులలో వెళ్లి నన్ను ఒంటరివాణ్ణి చేశారు. ఒంటరి తనాన్ని నేను భరించలేను. నాకు పుస్తకాలుంటే ఎవ్వరూ అక్కర్లేదని బడాయిపోయేవాడ్ని. అది నిజం కాదనిపించింది. బయటకెళ్లాను.

మేడ మీద నుంచి చూస్తే ఎదురింటి పశువులకొట్టంలో దృశ్యం. పిచ్చిదాన్లా వున్న ఓ స్త్రీ చేతిలో నెలల పిల్లో, సంవత్సరం పిల్లో వుంది. ఓ చేతిలో సిలవరి గ్లాసు. గ్లాసులో నీళ్లతో ఆవు పొదుగు కడుగుతోంది. ఇంతలో దూడ పొదుగులో మూతి పెడుతోంది. ఆవు కాళ్లతో తన్నింది. అది వెళ్లిపోయింది. ఆ స్త్రీ నీళ్లతో కడిగి పాలుపితుకు తోంది. ఆవు పాలు ఇస్తోంది. నా కాశ్చర్యం వేసింది. స్వంత దూడను రానివ్వని ఆవు ఆ స్త్రీని ఏం చేయ లేదు. అప్పుడనిపించింది. 'ఈ స్త్రీ ఎవరా?' అని.

ఇంట్లో ఏదో శబ్దం అయితే ఏమిటా అని వెళ్లాను. కొన్నాళ్ల క్రితం ఎలుక. ఇప్పుడు పందికొక్కయింది. సర్పంచ్ ఎంపిగా బలిసినట్లు, గిన్నె తిరగేసింది. ఈలోగా బయట గోల కేకలు. వెళ్లాను ఏమిటా? అని!

ఆ స్త్రీని జుట్టుపట్టుకొని ఈడ్చుకొని వీధిలోకి తెచ్చారు. తల వంచారు. పిడిగుద్దులు గుద్దు తున్నారు. ఒకాయన లుంగీ మీదకి కట్టి- ఎడం కాలి చెప్పు తీసి ఎడాపెడా వాయిస్తున్నాడు. ఒక చేత్తో నెలల పిల్లని గట్టిగా పట్టుకొని- 'తండ్రులారా! నన్నొగ్గండి-నన్నొగ్గండి' అరుస్తోంది.

బనీన్‌తో ఉన్నానేమో-

ఇంట్లోకెళ్లి షర్టు వేసుకొని గేటుదగ్గరకేసి, వీధిలోకి వెళ్లి- 'ఏమయింది?' అన్నాను.

''చిన్న పిల్లల దొంగండీ! ఎవుతి పిల్లనో ఎత్తుకొనొచ్చేసింది. దీనొగ్గరాదు. పోలీసు టేషన్లో నెట్టి బాదాలి!'' అన్నారు.

అప్పుడు గుర్తొచ్చింది. ఇందాక ఆవుపాలు తీస్తున్న సంగతి.

''అరే, ఇందాక పాలు పితుకుతుండడం చూసాను. మరి పాలెందుకు?''

''ఆ పిల్లకి. దీనికాడెక్కడవి. ముసలి గొడ్డు'' ఆ మాటకందరూ నవ్వారు.

''ఏమ్మా! నిజం చెప్పు. ఈ పిల్లని ఎక్కణ్ణుంచి తెచ్చావు? ఎందుకోసం తెచ్చావు? ఎక్కడకి తీసుకెళ్లాలనుకుంటున్నావు?'' అని అడిగాను.

''అదేం చెప్తాదండీ?'' అన్నారంతా.

''ఆగండాగండి. చెప్పనీండి.''

''బాబూ! దరమపెబూ! నీకాలొట్టుకుంతాను. నీంచెప్పింది నిజం. నమ్మండి. ఇది నా మనవరాలు. నా కూతురు...నడిపిదాయి కలాసీ పనికెళ్లి పెళ్లి కాకుండా కడుపు తెచ్చుకుంది. ఆ గండడు ఊరొగ్గేసి పారిపోండు. నా కూతురు దీన్ని నాకొగ్గేసి పారి పోనాది. మాది పక్కూరే. సిగ్గుతో ఊల్లో నుండనేక ఈ ఊరొచ్చాను. పిల్ల ఆకల్తో గోల సేత్తుంటే పాలు కోసం కక్కుర్తి పడ్డాను. నన్ను నమ్మండి. నీం దొంగని కాను. కాకపోతే నచ్చింపురం రండి నిజం మీకే తెలుస్తాది!''

నా నరాలు జివ్వుమన్నాయి.

ఈ జనం గొర్రెల మందలాటివారు. ఆ మధ్య ఊళ్లోకి కొత్తగా వచ్చి వేప చెట్టు కింద కూర్చుని జపం చేసుకుంటున్న సాధువుని చితకబాది పళ్లూడ గొట్టారు. తరువాత వాడు మూగవాడని తెలిసింది.

''ఏమయ్యా! ఆమె నొదలండి. మీకింకా నమ్మకం కుదరకపోతే ఆమె చెప్పినట్లు ఆ 'లక్ష్మీపురం' పదండి కనుక్కుందాం!!''

దానికి ఒప్పుకున్నారు. బండి మీద లక్ష్మీపురం వెళ్తే ఆమె చెప్పింది నిజమేనని తేలింది. నేను కోపాన్ని అణచుకోలేకపోయాను.

''చిన్న చిన్న విషయాల కింత స్పందిస్తారు. దేశాన్ని భ్రష్టు పట్టించి, పార్లమెంటుని అవినీతి కూపంలోనికి లాగుతోన్న వారి మీద మీ ప్రతాపాన్నెందుకు చూపరు? పదండి ముందా చెదని దులుపుదాం!'' అన్న నా మాటలు వాళ్లకు అర్థం కాలేదో, వినిపించలేదో మరి... ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.

*